



చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్ క్రీడా పోటీలు ప్రారంభం

7

విద్యతోనే.. వికాసం

- తెలంగాణతో పాటు ఏడు రాష్ట్రాల్లో అమలు కాని విద్యా హక్కు చట్టం
- 91 జీవో అమలైతే ఫీజులు నిర్ణయించుకునే అవకాశం
- కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన
- ప్రైవేట్, ప్రభుత్వ విద్యాసంస్థలు ఉన్నా బడి బయటే బడీడు పిల్లలు
- 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో నిర్వహించిన 'విద్యా హక్కు చట్టం'పై చర్చా వేదికలో డీఈవో ప్రవీణ్ కుమార్



'ఆంధ్రజ్యోతి' చర్చా వేదికలో మాట్లాడుతున్న డీఈవో ప్రవీణ్‌కుమార్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/న్యూటౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): 'చైతన్యమైన సమాజ నిర్మాణం వంద శాతం విద్యతోనే సాధ్యపడుతుంది. విద్యతోనే సమాజ వికాసం ముడిపడి ఉన్నది. ప్రతీ ఒక్కరు విద్యను అభ్యసించినప్పుడే ప్రగతి సాధ్యమవుతుంద'ని మహబూబ్‌నగర్ డీఈవో ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్ వీఎం సమావేశ మందిరంలో 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో 'విద్యాహక్కు చట్టం, ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత విద్య, ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య' అంశంపై బ్యూరో ఇన్‌చార్జి ఎస్.రవీందర్ రెడ్డి అధ్యక్షతన చర్చా వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈవో



ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యా హక్కు చట్టానికి ముందు దేశంలో విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వాలు పలు పథకాలను అమలు చేశాయని

(మిగతా 7లో..)

కేంద్రం నిధులు ఇవ్వడం లేదు



కేంద్ర ప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని తెచ్చింది. కానీ నిధులు మాత్రం విడుదల చేయలేదు. చట్టం చేసి, ప్రజలపై రుద్దడం కాదు. అది క్షేత్రస్థాయిలో అమలయ్యే తీరును పరిశీలించాలి. ప్రైవేట్ విద్యా సంస్థలలో 25 శాతం ఉచిత విద్యను ఇవ్వాలంటే ప్రభుత్వం వారికి ఎయిడెడ్ నిధులు ఇవ్వాలి. కానీ ప్రభుత్వం ఎయిడెడ్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసింది. 10 ఏళ్లకు మొన్న డీఎస్సీని నిర్వహించింది. చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు విద్యకు దూరం అయ్యారు. ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహించే పరీక్షల ప్రమాణాల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే పరీక్షల ప్రమాణాలు మెరుగ్గా ఉన్నాయని అసర్ రిపోర్టులో తేలింది. దేశ స్థూల జాతీయ ఉత్పత్తిలో విద్యకు 30 శాతం నిధులు కేటాయిస్తే తప్ప విద్యాహక్కు చట్టం సక్రమంగా అమలుకాదు.

\- ఎన్.వెంకటేష్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

వివక్ష వల్లే ఈ పరిస్థితి



ప్రభుత్వాలు ధనిక, పేద తరగతుల మధ్య వివక్షను చూపడం వల్లే నేడు ఈ పరిస్థితులు దాపురించాయి. విద్యలో వివక్ష లేకుండా అందరినీ సమానంగా చూసినప్పుడే మెరుగైన సమాజ నిర్మాణం అవుతుంది. కలెక్టర్ పిల్లలు, అటెండర్ పిల్లలు ఒకే బడిలో చదువుకోవాలి. విద్య, వైద్యం సదుపాయాలు అందరికీ సమానంగా అందించాలి.

\- బెక్కం జనార్థన్, ప్రముఖ న్యాయవాది

వ్యవస్థలో మార్పులు రానున్నాయి



విద్యా వ్యవస్థలో రానున్న రోజుల్లో పెను మార్పులు రానున్నాయి. ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది తరగతులకు పరీక్షలు నిర్వహించాలా? వద్దా? అని ప్రభుత్వం ఆలోచిస్తోంది. గతంలో మాదిరిగా 10 తరగతి పరీక్షల్లో గ్రేడింగ్ విధానం కాకుండా మార్కులు ఇవ్వనున్నారు. ప్రోగ్రెస్ కార్డుల స్థానంలో హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు రానుంది.

\- దుంకుడు శ్రీనివాస్, ఏఎంవో

ప్రపంచ దేశాలు అనుసరించాయి



పూర్వం మన విద్యా విధానాన్ని విదేశాలు సైతం అనుసరించేవి. అంత గొప్ప విద్యా విధానం మనది. కానీ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థలో పెను మార్పులు వచ్చాయి. వివిధ శాఖల్లో ప్రభుత్వాలకు ఆదాయాలు వస్తాయి. ఆదాయం రాని ఏకైక శాఖ విద్యా శాఖ. అందుకే దానిపై దృష్టి సారించడం లేదు. పాలకులు మారుతున్నప్పుడల్లా విద్యా విధానం మారుతుంది. ఎవ్వరికి నచ్చిన వ్యవస్థను వారు రూపొందించుకుంటున్నారు.

\- వై.శ్యాంబాబు, టీపీఆర్‌టీయూ అధ్యక్షుడు

ఓటుతోనే చైతన్యం






- ఓటు హక్కు తోనే సరైన నాయకత్వాన్ని ఎన్నుకునే అవకాశం
- ఉమ్మడి జిల్లాలో 34.54 లక్షల మంది ఓటర్లు
- 12 నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే అధికం
- అసెంబ్లీ ఎన్నికల్లో 70 నుంచి 75 శాతమే పోలింగ్
- సర్పంచ్‌ల ఎన్నికల్లో 80 శాతానికిపైగా..
- నేడు జాతీయ ఓటరు దినోత్సవం

'ఓటు వజ్రాయుధం'.. 'ఓటుతోనే సరైన నాయకత్వాన్ని ఎన్నుకునే అవకాశం ఉంటుంది' ఇలా ఎన్ని నినాదాలు ఉన్నా ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరగడం లేదు. పోలింగ్ బూత్ వరకు ఓటరు రావడం లేదు. నచ్చిన నాయకుడిని ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఎన్నుకుంటే ఓటుకు విలువ పెరుగుతుంది. ఓటు హక్కును వినియోగించుకోవడంతోపాటు అర్హులైనవారు ఓటర్లుగా పేరు నమోదు చేయించుకోవాలి. నేడు జాతీయ ఓటుహక్కు దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని ఓటర్లపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న కథనం..

\- మహబూబ్‌నగర్

ఎన్నికల కమిషన్ షెడ్యూల్ స్పెషల్ సమ్మరి రివిజన్(ఎస్ఎస్ఆర్) 2025 ప్రకారం ప్రస్తుతం ఉమ్మడి పాలమూరు జిల్లాలో 34,54,354 మంది ఓటర్లు, మరో 1899 మంది సర్వీస్ ఓటర్లు అదనంగా ఉన్నారు. 17,43,276 మంది మహిళా ఓటర్లు ఉండగా, 17,10,989 మంది పురుష ఓటర్లు ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 32,287 మంది ఎక్కువగా ఉన్నారు. ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాలలో



నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ స్టేషన్లు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
మహబూబ్‌నగర్	274	1,29,684	1,32,612	15	2,62,311
జడ్చర్ల	278	1,11,557	1,12,914	6	2,24,477
దేవరకద్ర	294	1,18,939	1,22,040	1	2,40,980
కొడంగల్	275	1,20,879	1,25,640	7	2,46,526
నారాయణపేట	270	1,17,536	1,21,089	4	2,38,629
మక్తల్	284	1,21,474	1,26,629	2	2,48,105
వనపర్తి	315	1,36,047	1,39,008	4	2,75,059
గద్వాల	303	1,26,502	1,31,947	11	2,58,460
అలంపూర్	291	1,19,021	1,22,491	10	2,41,522
నాగర్‌కర్నూల్	270	1,17,934	1,19,483	5	2,37,422
అచ్చంపేట	326	1,23,935	1,25,681	4	2,49,620
కల్వకుర్తి	271	1,24,414	1,22,107	2	2,46,523
షాద్‌నగర్	268	1,21,271	1,21,976	13	2,43,260
కొల్లాపూర్	284	1,21,796	1,19,659	5	2,41,460

కొల్లాపూర్, కల్వకుర్తి నియోజకవర్గాల్లో మాత్రమే పురుష ఓటర్లు అధికంగా ఉన్నారు.

ఓటు హక్కును వినియోగించుకుంటేనే..

ఓటు హక్కును వినియోగించుకుంటేనే సరైన నాయకత్వాన్ని ఎన్నుకునే అవకాశం ఉంటుంది. జిల్లాలో ఏ ఎన్నిక జరిగినా 20 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడం లేదు. సర్పంచ్ ఎన్నికల్లో మాత్రం ఆయా గ్రామాలలో పోటీ చేసే వాళ్ళు ఓటర్లను అధికంగా బూత్‌లకు తరలించడం వల్ల ఈ ఎలక్షన్స్‌లో 85-90 శాతం పోలింగ్ నమోదవుతోంది. ఎమ్మెల్యే

(మిగతా 6లో..)

పురపాలనకు రేపే ఆఖరు

- 27 నుంచి 'ప్రత్యేక' పాలన
- ఉమ్మడి పాలమూరులో 17 మునిసిపాలిటీలకు ముగియనున్న గడువు

6

కరడు గట్టిన సైబర్ నేరస్థుడు అరెస్టు

- రూ. 80 లక్షల విలువైన ఆస్తుల జప్తుతో పాటు కారు స్వాధీనం
- సైబర్ క్రైమ్ డీఎస్పీ రత్నం

6



శ్రీశైలం ప్రాజెక్టు వద్ద సుందర దృశ్యం

కనులవిందు

- పర్యాటక కేంద్రాల నియలం పాలమూరు
- నేడు జాతీయ పర్యాటక దినోత్సవం

6

పాలమూరు... పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఇక్కడ పర్యాటక కేంద్రాలకు కొదవ లేదు. జలజల పారే సెలయేళ్లు.. పక్షుల కిలకిలా రావాలు.. వన్యప్రాణులతో కళకళలాడే నల్లమల పచ్చదనం.. చెక్కుచెదరని పురాతన కట్టడాలు.. ఆధ్యాత్మికతతో కూడిన ఆలయాలు.. సంస్థానాలు.. ఇలా అనేక పర్యాటక సొబగులు చూపరులను ఇట్టే కట్టిపడేస్తున్నాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలో పర్యాటక కేంద్రాలు సందర్శకులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. శనివారం జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా మచ్చుకు కొన్ని పర్యాటక ప్రదేశాల చిత్రాలు మీకోసం..

\- మహబూబ్‌నగర్, ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు, మహబూబ్‌నగర్, వనపర్తి

దాచుకునేందుకే కేటీఆర్ విదేశీ పర్యటనలు

- ఐదేళ్లలో బీఆర్ఎస్ తెచ్చింది రూ.25 వేల కోట్ల పెట్టుబడులే..
- కాంగ్రెస్ 14 నెలల కాలంలో తెచ్చింది రూ.2.19 లక్షల కోట్లు
- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నన్ని రోజులు కేటీఆర్ ఇక్కడ దోచుకున్న సొత్తును పర్యటనల పేరుతో విదేశాల్లో దాచుకున్నారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. 2018-23 మధ్య కాలంలో బీఆర్ఎస్ హయాంలో కేటీఆర్ తెచ్చిన పెట్టుబడులు కేవలం రూ.25 వేల కోట్లు మాత్రమేనని, అదే 14 నెలల కాలంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటనలో రూ.2,19,182 కోట్ల పెట్టుబడులు తెచ్చారన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటిసారి సీఎం దావోస్ పర్యటన చేసినపుడు బీఆర్ఎస్ పార్టీ పెయిడ్ ఛానెల్స్ ఎన్నో తప్పుడు కథనాలు ప్రసారం చేశాయని ఎద్దేవా చేశారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే తెలంగాణ బిడ్డలకు 50 వేల ఉద్యోగాలు వస్తాయని స్పష్టం చేశారు. మెఘా ఇంజనీరింగ్ కంపెనీతో అగ్రిమెంట్ చేసుకున్నామంటే అంతర్జాతీయ వేదికపై తెలంగాణ స్థాయిని పెంచడం కోసమేనని పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆయిల్‌పాం ప్రాసెసింగ్ కంపెనీ స్థాపించబోతున్నామన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును ఎస్ జైపాల్‌రెడ్డి పీఎల్ఆర్ఐ ప్రాజెక్టుగా నామకరణం చేయడం హర్షణీయమన్నారు. మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, సీజే బెనహర్ పాల్గొన్నారు.

పూర్తయిన పనులకు బిల్లులు చెల్లించాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా ఎంపిక చేసిన పాఠశాలల్లో పూర్తి చేసిన పనులకు త్వరగా చెల్లింపులు చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల్లో పూర్తి చేసిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపుపై వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. పనుల ఎంబీ రికార్డులను పూర్తి చేసి, పెండింగ్ బిల్లులను చెల్లింపుల కోసం డీఈవో కార్యాలయానికి వారం లోగా రికార్డులు అందజేయాలన్నారు. జరిగిన పనులకు సంబంధించి ఫొటోలు, కమిటీ ధ్రువీకరణ సర్టిఫికెట్లను జతపర్చాలని సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, డీఈవో ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

చివరి రోజు రసాభాస

- చిన్నపొర్లలో అరుపులు, కేకల నడుమ సభ
- బిజ్వార్‌లో గ్రామస్థుల మధ్య వాగ్వాదం
- మద్దూరులో అనర్హులను ఇందిరమ్మ ఇళ్లకు ఎంపిక చేశారని ఆగ్రహం



ఊట్కూర్ మండలం చిన్నపొర్ల గ్రామ సభలో వాగ్వాదానికి దిగిన మహిళలను శాంతపరుస్తున్న హెడ్ కానిస్టేబుల్ సురేందర్

ఊట్కూర్/మరికల్/మద్దూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం లబ్ధిదారులను ఎంపిక చేయడానికి శుక్రవారం నారాయణపేట జిల్లాలోని ఊట్కూర్, మరికల్, మద్దూర్ మండలాల్లో నిర్వహించిన గ్రామసభలు రసాభాసగా మారాయి. ఊట్కూర్ మండలంలోని చిన్నపొర్ల, బిజ్వార్, వల్లంపల్లి గ్రామాల్లో వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. చిన్నపొర్లలో నిర్వహించిన సభలో బీఆర్ఎస్ నాయకుడు అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు ఏ హక్కుతో వేదికపై ఉన్నారని ప్రశ్నించడంతో గొడవ మొదలైంది. పార్టీ కోసం పనిచేసిన వారికి చెప్పకుండా ఇందిరమ్మ కమిటీ ఎలా వేశారని కాంగ్రెస్ నాయకుడు బి.హుస్సేన్ అధికారులను అడిగారు. దాంతో గందరగోళం నెలకొంది. ఒక సమయంలో ప్రజలంతా స్టేజీ వైపునకు దూసుకువచ్చారు. పోలీసులు వచ్చి, పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అర్హుల పేర్లను అధికారులు చదువుతుండగా, పేర్లు రాని మహిళలు అడ్డుకున్నారు. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. బిజ్వార్ సభలో భూములు ఉన్న వారిని ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఎలా ఎంపిక చేశారని గ్రామస్థులు ప్రశ్నించారు.

- మరికల్ మండలంలోని జిన్నారం, ఎక్లాస్‌పూర్, ఎల్లిగండ్ల, మాధవరం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన సభలో జడ్పీ సీఈవో భాగ్యలక్ష్మి, ఎంపీడీవో కొండన్న మాట్లాడారు. కొన్ని గ్రామాల్లో గ్రామ సభలు రసాభాసగా మారాయి. జాబితాల్లో పేర్లు లేకపోవడంతో ఎన్నిసార్లు దరఖాస్తులు చేసుకోవాలని అధికారులను నిలదీశారు.
- మద్దూర్‌లో నిర్వహించిన గ్రామ సభలోనూ గందరగోళం నెలకొంది. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో తమ పేరు లేదంటూ అధికారులపై కొందరు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనర్హులను ఎంపిక చేశారంటూ గ్రామస్థులు అన్నారు. సమావేశంలో తహసీల్దార్ మహేశ్‌గౌడ్, పీఆర్ డిప్యూటీ వివేక్, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, కోస్గి మార్కెట్ కమిటీ చైర్మన్ భీములు పాల్గొన్నారు.

ఓటుతోనే ప్రజా చైతన్యం



(5వ పేజీ తరువాయి)

ఎన్నికల్లో 80 శాతం, ఎంపీ ఎన్నికల్లో 70 శాతమే పోలింగ్ నమోదవుతుంది. పట్టణాలలో ఈ శాతం మరింత తక్కువగా ఉంటుంది. అందుబాటులో ఉన్నా లైన్లో నిలబడి ఓటువేసే ఓపిక లేక చాలామంది ఓటుహక్కును వినియోగించుకోవడం లేదు. ఓటర్లుగా పేర్లు నమోదు చేయించుకోవడం, ఓటు హక్కును వినియోగించుకోవడంపై ఎన్నికల కమిషన్, ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా ఆశించిన స్థాయిలో ఓటు శాతం నమోదు కావడం లేదు.

ఆరవై ఏళ్లుగా ఓటువేస్తున్నా

ఆరవై ఏళ్ళుగా ఎన్నోసార్లు ఓటు వేస్తున్న. ఇప్పుడు నా వయస్సు 80 సంవత్సరాలు. కొన్నిసార్లు నచ్చిన వ్యక్తులకు వేసిన, కొన్నిసార్లు బలవంతంగా ఓటు వేయించుకున్నారు. అన్ని ఎన్నికల్లో ఓటు వేస్తూనే ఉన్నా. నేను ఓటేసిన వారిలో ఎంతో మంది గెలిచారు. ఎందరో ఓడిపోయినవాళ్లు ఉన్నారు. ఓటు వేసిన వ్యక్తి గెలిచినప్పుడు సంతోషమే వేరు. ఓటు వేయకపోతే సచ్చియినట్లు లెక్కంటారు. అందుకే ఎక్కడున్నా వచ్చి ఓటు వేస్తా.



- గడ్డం లక్ష్మమ్మ, భూత్పూర్

ఈసారే కొత్తగా ఓటు వచ్చింది



ఇంటర్ వరకు చవివా. ఈ సారే ఓటు హక్కు వచ్చింది. ఎన్నికలు వస్తే మొదటిసారి ఓటు వేసేందుకు ఎదురు చూస్తున్నా. ఓటు ఎలా వినియోగించువాలనే విషయంలో కాస్త ఆతృత ఉంది. ఓటుహక్కు వచ్చినందుకు సంతోషంగా ఉంది.

- మనోహర్, భూత్పూర్

సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకోవాలి

ఎన్నికల్లో పోటీ చేసే వారికి నిజాయితీ ఉండాలి. అప్పుడే దేశం, రాష్ట్రం, మారుమూల గ్రామం అభివృద్ధి చెందుతుంది. ప్రతీ ఒక్కరిలో స్వార్థం చోటు చేసుకుంటుంది. ప్రజా ధనాన్ని ఉపాధి కల్పించే అవసరాలకు ఖర్చు పెట్టాలి. అవసరం లేని ఉచితాలకు ఖర్చుపెట్టి, అప్పుల కుంపటిగా మారుస్తున్నారు. రైతు పండించిన ధాన్యానికి మద్దతు ధరను చెల్లించి, విద్య, వైద్యాన్ని ఉచితంగా అందిస్తే ప్రతీ కుటుంబం అభివృద్ధి దిశగా పయనిస్తుంది. ఓటు ద్వారా సమర్థవంతమైన నాయకుడినే ఎన్నుకోవాలి.

- అరుణ, గృహిణి, బీఏ, బీఈడీ

ఓటు హక్కును వినియోగించుకోవాలి



18 ఏళ్లు నిండిన యువతీ యువకులంతా ఓటు హక్కు నమోదు చేసుకోవాలి. బాధ్యతతో ఓటు వేయడం ద్వారా మంచి నాయకత్వాన్ని ఎంచుకొనే అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి. ఓటర్ల దినోత్సవం ప్రజాస్వామ్యానికి జీవం పోసే, ఓటు హక్కును గౌరవించుకోవడానికి గొప్ప వరం. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సమర్థవంతమైన నాయకున్ని ఎన్నుకొని, ప్రపంచంలో అత్యుత్తమ భారత ప్రజాస్వామ్యానికి మీవంతు కృషి చేయాలి.

- కేవీవీ రవికుమార్, డీఆర్‌వో, మహబూబ్‌నగర్

భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలి

- జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు
- వంటలు చేసుకునేందుకు ఆలయ పరిసర ప్రాంతంలో వసతులు
- టెంపుల్ వెలుపల కూడా సీసీ కెమెరాలతో నిఘా
- ఆర్డీవో నవీన్ కుమార్
- గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలపై అధికారులతో సమీక్ష



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీవో నవీన్‌కుమార్

జడ్చర్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి, భక్తులకు ఏర్పాట్లు చేయాని ఆర్డీవో నవీన్‌కుమార్ చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గంగపురం లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలపై ఆర్డీవో సమీక్ష జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమీక్ష చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కనీస మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులు నడుపుతోందన్నారు. భక్తులు వంటలు చేసుకునేందుకు ఆలయం పరిసర ప్రాంతంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆలయంలో ఇప్పటికే 32 సీసీ కెమెరాలు ఉన్నాయని, వెలుపల సైతం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతర నిఘా ఉంచనున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయాన్ని తహసీల్దార్ బ్రహ్మంగౌడ్, ఎంపీడీవో విజయ్‌కుమార్, గ్రామ కార్యదర్శి శ్రీనివాసులు పరిశీలించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు ప్రత్యేక నిధులు మంజూరీ చేయాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆర్డీవో నవీన్‌కుమార్ తెలిపారు. గ్రామ పంచాయతీలో నిధులు లేవని, గడిచిన ఆరు నెలలుగా ఇప్పటికే సుమారు రూ.నాలుగు లక్షలకు పైగా అప్పులు తెచ్చి వెచ్చించానంటూ ఆర్డీవో దృష్టికి గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు తీసుకొచ్చారు. ఆలయ ఈవో దీప్తిరెడ్డి, ఎంపీవో సరోజ, ఆర్టీసీ డీఎం సుజాత, ఎక్సైజ్ ఎస్‌ఐ నాగరాజు, జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి, ట్రస్టీ సభ్యులు జనార్దన్‌రెడ్డి, బ్రహ్మలింగం, గోపాల్‌యాదవ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వనాథన్

అచ్చంపేటటౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఏఐసీసీ కార్యదర్శి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి విశ్వనాథన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో ఏర్పాటు చేసిన ముఖ్యనాయకుల సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్దాల నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరస్తూ వస్తున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై బీఆర్‌ఎస్ పార్టీ దుష్ప్రచారాన్ని ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, నాయకులు కట్ట అనంతరెడ్డి, నాయకులు కాశన్న యాదవ్ పాల్గొన్నారు.

నేడు స్పౌజ్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం జనవరి 24 (ఆంధ్రజ్యోతి): స్పౌజ్ ఉపాధ్యాయులకు శనివారం మహబూబ్‌నగర్‌లోని ఆర్‌వీఎం సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మహబూబ్‌నగర్ జిల్లాకు వివిధ జిల్లాల నుంచి 112 మంది అలాట్ అయ్యారు. వీరందరి సర్వీస్ బుక్కులను పరిశీలించారు. జిల్లాలోని వివిధ మండలాల్లో పని చేస్తున్న వారి భార్యాభర్తలకు పక్కనే ఉన్న పాఠశాలను కేటాయించనున్నారు. ఇందుకు సబంధించి జిల్లా కేంద్రంలోని ఆర్వీఎం సమావేశ మందిరంలో మండల యూనిట్‌గా కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. టీపీఆర్టీయూ అధ్యక్షుడు శ్యాంబాబు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రపతి అవార్డుకు ఆరేపల్లి వాసి

ఆత్మకూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : చేపల పెంపకం వృత్తిగా చేసుకొని రాష్ట్రంలో అత్యధికంగా చేపల ఉత్పత్తి చేపడుతూ రాష్ట్రపతి అవార్డుకు వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం ఆరేపల్లి గ్రామవాసి ఏటికాడి ఆనంద్ ఎంపికయ్యారు. జనవరి 26న జరగబోయే రిపబ్లిక్ డే రోజున రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. 10 సంవత్సరాల పాటు చేప పిల్లల పెంపకాన్ని చేపట్టి రాష్ట్రంలోనే అత్యధికంగా చేపల ఉత్పత్తిని చేపట్టడమే కాకుండా నాణ్యమైన చేప పిల్లలను అందించడమే లక్ష్యంగా చేసుకుని ఉత్పత్తి చేపట్టారు. దీంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీని పొందారు. అంతేకాకుండా ఈ ఉత్పత్తి ద్వారా ఎందరికో ఉపాధి కల్పించారు. ఆత్మకూరు మండలం మేధావులు, నాయకులు అభినందించారు.

పురపాలనకు రేపే ఆఖరు

- 27 నుంచి ప్రత్యేక పాలన
- ఉమ్మడి పాలమూరులో రెండు మినహా 17 పురపాలికలకు ముగియనున్న గడువు

మహబూబ్‌నగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పురపాలన మరో 48 గంటల్లో ముగియనుంది. ఈనెల 26తో పాలక మండలి గడువు ముగియనుంది. అంటే మరో రెండు రోజుల్లో ప్రస్తుత చైర్మన్‌లు, కౌన్సిలర్‌లు మాజీలు కానున్నారు. ప్రస్తుతం ఎన్నికలు జరిగే అవకాశం లేనందున పురపాలన 27 నుంచి ప్రత్యేక అధికారుల చేతుల్లోకి వెళ్ళనుంది. జిల్లా కేంద్రాల్లో ఉండే పురపాలికలకు అదనపు కలెక్టర్‌లు ప్రత్యేక అధికారులుగా నియమితులు కానున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 19 మునిసిపాలిటీలు ఉండగా.. జడ్చర్ల, అచ్చంపేట మునిసిపాలిటీలకు మరో 15 నెలల గడువు ఉంది. వీటికి 2021 ఏప్రిల్ 30న ఎన్నికలు జరుగగా, మే మూడో తేదీన ఫలితాలు వెలువడ్డాయి. అంటే ఈ రెండు మునిసిపాలిటీలకు 2026 మే మూడు వరకు గడువు ఉంటుంది. ఈ రెండు మునిసిపాలిటీలు మినహా మిగతా అన్ని మునిసిపాలిటీలలో ప్రత్యేక పాలన ప్రారంభం కానుంది.

బాలికలను కాపాడుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి పాపిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పాపిరెడ్డి

మహబూబ్‌నగర్, విద్యావిభాగం జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బాలికలను కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందని ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్ న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ బి.పాపిరెడ్డి అన్నారు. బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని చైల్డ్ ఫ్రెండ్లీ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ లైన్ ఉన్నత పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కులు, రక్షణ, సంరక్షణ వంటి అంశాలపై సూచనలు చేశారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని, ఎవరైనా ఇబ్బంది పెడితే 1098 సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికారిక సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయాధికారి ఇందిర మాట్లాడుతూ బాలికల హక్కులు, రక్షణ, సంరక్షణ కోసం జిల్లా న్యాయ సేవ సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్ ఫ్రెండ్లీ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్పీ జానకి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకెళ్లాలన్నారు. జిల్లా సంక్షేమాధికారి జరీనా, ఏఎంవో దుంకుడు శ్రీనివాస్, బార్ అసోషియేషన్ కార్యదర్శి రామ్‌నాథ్ గౌడ్, సీనియర్ న్యాయవాది రవికుమార్ యాదవ్ పాల్గొన్నారు.

కనులవిందు

- పర్యాటక కేంద్రాల పాలమూరు

- నేడు జాతీయ పర్యాటక దినోత్సవం



మన్యంకొండ ఆలయం



ఫరహాబాద్ వ్యూ పాయింట్



అక్కమహాదేవి గుహలు




కొత్తకోట మండలం పామాపురంలో..




జటప్రోల్‌లో ప్రాచీన కట్టడం



మహబూబ్ నగర్‌లో పిల్లల మర్రి



అలంపూరు జోగుళాంబ ఆలయం



కనువిందు చేస్తున్న సోమశిల అందాలు



జూరాల ప్రాజెక్టు

మహబూబ్‌నగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పాలమూరులో పర్యాటక రంగానికి కొదువలేదు.. జిల్లాలోని ఎన్నో ప్రాంతాలు ప్రకృతిరమణీయానికి తార్కాణాలు.. జిల్లాలో ప్రవహిస్తున్న కృష్ణానదీ పరివాహ ప్రాంతమంతా ప్రకృతి రమణీయం.. ఎటు చూసినా కనువిందుచేసే అందమైన ప్రదేశాలు.. ప్రకృతిని ఆస్వాదించే ప్రేమికుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.. ప్రకృతి ప్రేమికుల అభిరుచుల మేరకు టూరిజం రంగాన్ని మరింత అభివృద్ధి చేయాల్సి ఉంది. చాలాచోట పర్యాటక ప్రాంతాలకు ఆదరణ కరువవుతోంది.. పారిశుధ్య సమస్యలు, సరైన మెయింటెనెన్స్ లేక నిరాదరణకు గురవుతున్నాయి.. ప్రభుత్వం పర్యాటక రంగానికి నిధులు కేటాయించి ప్రకృతి సంపద అంతరించిపోకుండా బావితరాలకు అందించాల్సిన అవసరం ఉంది.

- పిల్లలమర్రి మహావృక్షాన్ని తిలకించేందుకు ఉమ్మడి జిల్లాతో పాటు పక్క రాష్ట్రాల నుంచి సందర్శకులు తరలివస్తుంటారు. 700 సంవత్సరాల చరిత్ర కలిగిన పిల్లలమర్రి చూపరులను ఆకర్షిస్తోంది.
- మయూరి అర్బన్ ఎకోపార్క్ రెండు వేల ఎకరాలలో విస్తరించిన అతిపెద్ద పార్క్. ఇక్కడ అడ్వెంచర్ జోన్, జిప్ సైకిల్, బటర్‌ఫ్లై పార్క్, కృత్రిమ రెయిన్‌ఫాల్స్, వాటర్‌ఫాల్స్, జంగిల్‌సఫారి, కరెన్సీపార్క్ వంటివి సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.
- కోయిల్‌సాగర్ ప్రాజెక్టు ప్రకృతి ప్రేమికులను ఆకర్శిస్తోంది. నీటితో నిండిన సరస్సు, గేట్లు తెరిచినపుడు సందర్శకుల సందడి అంతా ఇంతా కాదు. కుటుంబం, స్నేహితులతో కలిసి పిక్నిక్ చేయడానికి మంచి ప్రదేశంగా ప్రసిద్ధి చెందింది.
- జూరాల ప్రాజెక్టు కూడా జిల్లాలో ఉన్న పర్యాటక ప్రదేశాలలో ఒకటి. ప్రాజెక్టు గేట్లు తెరిచినపుడు సందర్శకులు ఇక్కడికి పెద్దఎత్తున తరలివస్తుంటారు. చేపలు పుష్కలంగా లభించడంతో ఇష్టంగా భుజించేందుకు గేట్లు తెరిచిన సమయంలో సందర్శకులు తరలివస్తారు.
- సోమశిల సోయగాల గురించి చెప్పక్కర్లేదు. సోమశిల నల్లమల అటవీ మధ్యన ప్రవహించే కృష్ణానది సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచుతుంది. ఇక్కడ బోటింగ్ సౌకర్యం, టూరిజం హోటళ్ళు ఉండటంతో సందర్శకులు సోమశిల నుంచి స్టీమర్‌లలో నల్లమల అందాలను చూస్తే శ్రీశైలం వెళ్లే సౌకర్యం ఉండటంతో సోమశిల టూరిజానికి ఆదరణ ఉంది.
- రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన అలంపూరు జోగుళాంబ అమ్మవారు. శక్తిపీఠంగా అమ్మవారిని నిత్యం కొలుస్తారు.
- వీటితోపాటు సలేశ్వరం, మల్లెల తీర్థం, బీచుపల్లి, సరళాసాగర్, కందూరు కల్పవృక్షాల క్షేత్రం, ఉమామహేశ్వరం, మన్యంకొండ, పామాపురం, అక్కమహాదేవి గుహలు, శ్రీరంగాపురం, మక్తల్ నిలువురాళ్ల, వనపర్తికోట వంటి పర్యాటక క్షేత్రాలు పాలమూరు జిల్లాలో ఉన్నాయి.

కరడుగట్టిన సైబర్ నేరస్థుడి అరెస్టు

వనపర్తి క్రైమ్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కొన్ని నెలలుగా గ్రామీణ ప్రాంతాల్లోని యువకులను డబ్బు ఆశ పేరుతో సైబర్ నేరాల వైపు మళ్లించి ప్రజలను మోసం చేస్తున్న సైబర్ ముఠాలోని కరుడుగట్టిన నేరస్తుడిని శుక్రవారం అరెస్టు చేసినట్లు సైబర్ క్రైమ్ డీఎస్పీ రత్నం తెలిపారు. శుక్రవారం వనపర్తి సీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డీఎస్పీ వివరాల మేరకు గత నాలుగు సంవత్సరాలుగా రెండు తెలుగు రాష్ట్రాలలోని అమాయక ప్రజలను ధని, ముద్ర, ఇండియా బుల్స్ అనే లోన్స్ పేరు మీద మోసం చేస్తున్న ముఠాలోని 29 మందిని ఇప్పటికీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సైబర్ నేరగాడు పెద్దమందడి మండలం బలిజపల్లి గ్రామానికి చెందిన రమేష్ నాయక్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్లు తెలిపారు. రమేష్ నాయక్ గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఉమ్మడి జిల్లాలోని యువకులకు డబ్బు ఆశ చూపి సైబర్ నేరాల వైపునకు మళ్లించి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేస్తున్నాడని తెలిపారు. గత ఏడాది ఫిబ్రవరి 20వ తేదీన వనపర్తి జిల్లా పీపనగండ్ల మండలం పుల్గర్‌చర్ల గ్రామానికి చెందిన రాముడికి సైబర్ నేరస్తుడైన వెంకటేష్ అనే వ్యక్తి ఫోన్ చేసి మీకు రూ.రెండు లక్షలు లోన్ మంజూరు అయిందని తెలిపారు. అందుకు గాను ముందుగా ఇన్సూరెన్స్ డబ్బులు చెల్లించాలని సైబర్ నేరస్తుడు వెంకటేష్ అడగడంతో రాముడు గూగుల్ పే ద్వారా రూ.33,993 చెల్లించాడు. మరుసటి రోజు వెంటనే ఫోన్ చేయగా స్పందించకపోవడంతో మోసపోయానని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు విచారణలో భాగంగా రమేష్ నాయక్‌ని అదుపులోకి తీసుకుని విచారించగా గత కొన్ని సంవత్సరాలుగా ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఎర్రగట్టుతండా, పామిరెడ్డిపల్లి ముందరితండా, చీకటిచెట్టుతండా, పిల్లికుంటతండా, సూర్తి తండా, కనకాపూర్ తండాతో పాటు మరికొన్ని గ్రామాలకు చెందిన యువకులకు సైబర్ నేరాలకు చేసేందుకు ఢిల్లీ, కోల్‌కత్తా, పాట్నాలకు తీసుకెళ్లి సైబర్ నేరాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. వీరికి అక్కడ రోహిత్, రాజు భాయ్, సోను, పవన్, రాజు, శివకుమార్, శంకర్ , పంకజ్, అంకిత్‌ల సహకారంతో శిక్షణ పూర్తయిన తరువాత వచ్చిన ఆదాయంలో 30 శాతం వాటా వీరు తీసుకుని మిగతా 70 శాతం వారికి చెల్లించేవారని తెలిపారు. ఈ కేసులో దొరికిన రమేష్ నాయక్ సుమారు ఒక కోటి రూపాయల కంటే ఎక్కువ సంపాదించాడని, ఇతనికి సహకరించిన ఈ కేసులో ఇతనితో పాటు వారి అన్న చంద్రశేఖర్, వారి అమ్మ గోపమ్మని కూడా నేరస్తులుగా గుర్తించి చేర్చినట్లు డీఎస్పీ తెలిపారు. రమేష్ నాయక్ తన తండాలో నిర్మించిన విలాసవంతమైన రూ.45 లక్షల ఇల్లు, వనపర్తి పట్టణంలో 24 లక్షల విలువైన రెండు ప్లాట్లు, 12 లక్షల 50 వేల విలువైన కియా సోనెట్ కారును స్వాధీనం చేసుకుని జప్తు చేసినట్లు తెలిపారు. మిగతా కొంత డబ్బు తమ జల్సాలకు ఖర్చు పెట్టాడని తెలిపారు. జప్తు చేసిన వాటన్నిటిని స్థిరాస్తి పత్రాలతో పాటు కోర్టులో సమర్పించినట్లు తెలిపారు. ఈ కేసు విచారణను సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, డీఎస్పీ జితేందర్ రెడ్డి, వనపర్తి రావుల గిరిధర్ ఆధ్వర్యంలో చేపట్టినట్లు తెలిపారు. కేసు విచారణలో వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ కృష్ణయ్య, సైబర్ బ్యూరో ఎస్‌ఐ రవికుమార్, రాణి, హెడ్ కానిస్టేబుల్స్ నగేష్, కానిస్టేబుల్స్ నర్సింగౌడ్, సత్యం, విజయ్ పాల్గొన్నట్లు డీఎస్పీ తెలిపారు.

స్వచ్ఛమైన నీరు అందించేందుకే అమృత్-2 పథకం



సమావేశంలో మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సరిత వర్గం

గద్వాల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో అమృత్-2 పథకాన్ని అమలు చేస్తున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మిషన్ భగీరథ పథకంలో జరిగిన లోపాలకు తావులేకుండా పట్టణ ప్రజలకు పుష్కలంగా స్వచ్ఛమైన నీరు అందిస్తామని వివరించారు. శుక్రవారం అమృత్-2 పథకంలో భాగంగా నదీ అగ్రహారంలో రూ.63.25కోట్లలో నిర్మించే మంచినీటి పథకానికి ఎంపీ డాక్టర్ మల్లురవి, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ పథకం ద్వారా మంచినీరు అందుతుందని వివరించారు. గ్రామీణ ప్రజలకు ఒక్కొక్కరికి 100 లీటర్లు కాగా పట్టణ ప్రజలకు 135లీటర్లు అవసరం అని వివరించారు. గద్వాల పట్టణం విస్తరించడం చాలాఏళ్ల క్రితం నిర్మించిన మంచినీటి పథకాలు ఉండటంతో దానికి తగినట్లుగా మరో 30ఏళ్లకు సరిపోయే విదంగా రూ.63.25కోట్లతో ఈ పథకాన్ని విస్తరిస్తున్నామని వివరించారు.

ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ. 28.75కోట్లు భరిస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 34.50కోట్లను ఖర్చు చేస్తుందని వివరించారు. ఈ పథకంలో కొన్ని మార్పు చేయాలనే అంశం వచ్చిందని దానిని సాంకేతిక నిపుణులు పరిశీలించాలని సూచించారు. నాణ్యతతో నిర్మించాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులకు ఆయన సూచించారు. గద్వాలకు రూ.175కోట్లతో 3,500 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు అయ్యాయని వివరించారు. ప్రతీ నెల వడ్డీలకే రూ.6,500కోట్లు చెల్లిస్తున్నామని ఈ ఏడాది రూ.75వేల కోట్లు చెల్లించామని వివరించారు. చేస్తున్న అభివృద్ధి ఇస్తున్న సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. అభివృద్ధిని, సంక్షేమాన్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అంతకు ముందు ఎంపీ డాక్టర్ మల్లురవి, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మునిసిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్‌లు ప్రసంగించారు. మునిసిపల్ చైర్మన్ పలు సూచనలు చేయగా, మంత్రి వాటిని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ బీఎం సంతోష్, వైస్ చైర్మన్ బాబర్, టీపీసీసీ సభ్యుడు గంజిపేట శంకర్, పట్టణ అధ్యక్షుడు ఇసాక్, పీఏసీఎస్ అధ్యక్షుడు సుబాన్, వార్డు కౌన్సిలర్ మాణిక్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు జిల్లాల ఫోర్స్‌తో బందోబస్తు

మంత్రిని అడ్డుకుంటారనే సమాచారం ఇంటలిజెన్స్‌కు ముందే అందడంతో ఎస్పీ శ్రీనివాసరావు పలు జాగ్రత్తలు తీసుకున్నారు. మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తితో పాటు గద్వాల స్పెషల్ ఫోర్స్‌ను రంగంలో దించారు. ఉమ్మడి జిల్లా నుంచి 30మంది ఎస్సైలు, 20మంది ఏఎస్సైలు, ఇద్దరు డీఎస్పీలు, సీఐలతో పాటు దాదాపు 100మందికి పైగా పోలీసులతో భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. జమ్మిచేడు నుంచి నదీ అగ్రహారం వరకు రోడ్డు వెంట కూడళ్ల, సభాప్రాంగణం పోలీసులతో నిండిపోయింది.

మధ్యలోనే బహిష్కరించిన సరిత వర్గం

శంకుస్థాపన ప్రాంగణానికి వచ్చిన మంత్రి జూపల్లి, ఎంపీ డాక్టర్ మల్లు రవికి జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత స్వాగతం పలికి సత్కరించారు. శంకుస్థాపన అనంతరం స్టేజీపైకి ఒక్కొక్కరిని పిలిపించారు. ఈ క్రమంలో సరితను పిలువకపోవడంతో ఆమె వర్గం మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఒక్కసారిగా సభాప్రాంగణం హోరెత్తిపోయింది. పోలీసులు అప్రమత్తం అయ్యారు. పరిస్థితిని గమనించిన సరిత అక్కడి నుంచి బయటకు వచ్చారు. ఆమెతో పాటు నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేస్తూ బయటకు రాగా కారెక్కిపోతున్న సరిత ఆమె భర్త తిరుపతయ్యను కార్యకర్తలు అడ్డుకున్నారు. మంత్రితో తేల్చుకోవాలని నినాదాలు చేశారు. దీంతో పోలీసులు వారిని అడ్డుతొలగించి సరితను పంపించారు.

విద్యతోనే వికాసం



'ఆంధ్రజ్యోతి' చర్చావేదికకు హాజరైన ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యాశాఖ అధికారులు, విద్యార్థులు

(5వ పేజీ తరువాయి)

ఆంధ్రజ్యోతి చర్చావేదిక

తెలిపారు. 2009లో తెచ్చిన విద్యా హక్కు చట్టం 2010 నుంచి దేశవ్యాప్తంగా ఈ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ఈ చట్టంలో భాగంగా ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు 25 శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలని ఉందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఈ చట్టం అమలులో ఉందన్నారు. కానీ ఏడు రాష్ట్రాల ప్రైవేట్ విద్యాసంస్థలు కోర్టుకు వెళ్లడంతో ఆయా రాష్ట్రాల్లో అమలుకు నోచుకోలేదన్నారు. అందులో మన తెలంగాణ రాష్ట్రం కూడా ఉందన్నారు. జిల్లాలో కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన సాగుతున్నదన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచాన్ని తట్టుకుని నిలబడేలా ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లోని పాఠశాలల్లో సమస్యలు ఉన్నాయన్నారు. వాటిని త్వరలోనే అధిగమిస్తామన్నారు.

91 జీవో అమలైతే ఫీజులు నిర్ణయించుకునే అవకాశం

జీవో నెంబర్ 91 అమలు కావడం లేదని, అది అమలైతే ఫీజులు ఎంత ఉండాలో నిర్ణయం తీసుకునే వెసులుబాటు ఉంటుందని డీఈవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. జిల్లా రాష్ట్ర స్థాయిలో కమిటీలు వేసి అందులో విద్యార్థి సంఘాల ప్రతినిధులను భాగస్వాములను చేసే అవకాశం ఉంటుందన్నారు. ప్రైవేట్, ప్రభుత్వ విద్యా సంస్థలు ఉన్నప్పటికీ ఇంకా బడిఈడు పిల్లలు బడి బయటే ఉన్నారాన్నరు. వచ్చే విద్యా సంవత్సరం 'మన ఊరు- మన బడి' కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించి, పిల్లలను బడిలో చేర్పించే బాధ్యతను సమష్టిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలలో నిబంధనల ఉల్లంఘన జరిగితే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులను విద్యేతర ప్రభుత్వ కార్యక్రమాలలో వినియోగించుకోవడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. అంతకు ముందు 'ఆంధ్రజ్యోతి' బ్యూరో ఇన్‌చార్జి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలలో విద్యా హక్కు చట్టం అమలుపై అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో 'ఆంధ్రజ్యోతి' ఎడిషన్ ఇన్‌చార్జి అలువాల తిరుపతయ్య, బ్రాంచ్ మెనేజర్ చంద్రశేఖర్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది బెక్కం జనార్ధన్, ప్రైవేటు విద్యాసంస్థల ప్రతినిధులు వెంకట్ రెడ్డి, లక్ష్మణ్, మల్లేశ్, నందు, వంశీమోహన్ రెడ్డి, విద్యార్థి సంఘాల నాయకులు భరత్, సంతు, భరత్, ఏఎంవో దుంకుడు శ్రీనివాస్, ఎంఈవో లక్ష్మణ్ సింగ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎస్.వెంకటేష్, రవికుమర్, కృష్ణుడు, ఎన్.ప్రభాకర్, రాంచదర్‌జీ, అంజిరెడ్డి, వై.శ్యాంబాబు, శ్రీశైలం, మదన్‌మోహన్ యాదవ్, ప్రశాంత్, బాబునాయుడు, ప్రశాంత్ పాల్గొన్నారు.

చట్టం 99 శాతం బాగుంది



యూపీఏ-2 ప్రభుత్వం 2010లో శ్రీకారం చుట్టిన విద్యాహక్కు చట్టం 99 శాతం బాగుంది. చట్టంలోని 26వ సవరణలో ఆర్టికల్ 16ఏ, 17, 32 సెక్షన్ల ప్రకారం చదువులో వెనుకబడిన వారిని ముందు తరగతికి అనుమతించాల్సి ఉంటుంది. విద్యార్థులు ఎన్ని తప్పులు చేసినా, వారిని శిక్షించవద్దని ఆదేశించింది. దీంతో విద్యార్థులు చదువును నిర్లక్ష్యం చేస్తూ పెడదోరణిలోకి వెళ్తున్నారు. ఈ అంశాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకొని, అవసరమైన మార్పులు చేయాలి.

- వెంకట్ రెడ్డి, వాగ్దేవి కళాశాల కరస్పాండెంట్

విద్యార్థులు పరిమిత సంఖ్యలో ఉండాలి



కార్పొరేట్ సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో ఉన్నట్లుగా విద్యార్థుల సంఖ్యకు పరిమితి ఉండాలి. కోట్లాది రూపాయిల పెట్టుబడులతో విద్యాసంస్థలను ఏర్పాటు చేసి కరికులాన్ని దెబ్బతీస్తున్నాయి. కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులకు అన్‌స్కిల్డ్ లేబర్ కన్నా తక్కువ వేతనాలు ఇస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో ఆ మాత్రం కూడా ఉండటం లేదు. ఫీజుల నియంత్రణ కమిటీని ఏర్పాటు చేయాలి.

- మలేశం, ప్రైవేట్ పాఠశాలల సంఘం జిల్లా అధ్యక్షుడు

మెరుగుపడిన ప్రభుత్వ పాఠశాలలు



విద్యాహక్కు చట్టం వచ్చిన తర్వాత 50 శాతం ప్రభుత్వ పాఠశాలలు మెరుగుపడ్డాయి. సర్కార్ బడుల్లో మౌలిక వసతులు కల్పించారు. అన్ని ప్రైవేట్ పాఠశాలలో 25 శాతం మంది విద్యార్థులకు ఉచిత విద్య అందించాల్సిందే. ప్రైవేట్ పాఠశాలలు మాఫియాలాగా మారాయి. వాటికి అనుమతులు ఇచ్చేటప్పుడు ఆటస్థలం, ఫైర్ సేఫ్టీ, తదితర సదుపాయలను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రభుత్వ ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి తప్పించాలి.

- మదన్‌మోహన్ యాదవ్, పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు

చట్టంపై సమగ్ర చర్చ జరగలేదు



విద్యాహక్కు చట్టంపై రాజ్యసభ, లోక్‌సభల్లో సమగ్రమైన చర్చ జరగకుండానే 2009లో విద్యాహక్కు చట్టం బిల్లును ఆమోదించారు. ఈ చట్టంలో పలు లోపాలున్నాయి. ఆటిని సరిదిద్దాల్సి ఉంది. గుణాత్మక విద్యను అందించాలని చట్టంలో ఉన్నా, అమలుకు నోచుకోవడం లేదు. ఆర్టికల్ 45 ప్రకారం ఉచిత నిర్బంధ విద్యను అందించాలి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఒకే కరికులంలో విద్యాబోధన కొనసాగాలి. అప్పుడే అందరికీ సమాన అవకాశాలు వస్తాయి.

- శ్రీశైలం, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

వివక్షకు తావు లేకుండా విద్య



పుట్టిన ప్రతీ బిడ్డకు లింగ, కుల, మత వివక్ష లేకుండా మెరుగైన విద్యను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. విద్యా హక్కు చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలి. సామాజిక రుగ్మతలపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించాలి.

- వెంకటేశ్వర్లు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

కేంద్రీకృత విద్యకు కుట్రలు



కేంద్రీకృత విద్యావిధానాన్ని తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోంది. జూలై, ఆగస్టు మాసాల్లో రిటైర్‌మెంట్ ఉన్న ఉపాధ్యాయుల సర్వీసులను పొడిగించాలి. అప్పటి వరకు బోధించిన ఉపాధ్యయులు రిటైర్ అవడం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారు.

- రవికుమార్, టీఎస్‌యూటీఎఫ్ నాయకుడు

ఆ రెండు విద్యాసంస్థలే అధికం



దేశంలోని అత్యధిక విద్యాసంస్థలు చైతన్య, నారాయణలవే. ఈ రెండు సంస్థలకు దేశ వ్యాప్తంగా 275 విద్యా సంస్థలు ఉన్నాయి. వీటిని అడ్డుకోవడంలో పాలకులు విఫలమయ్యారు. వీరి ధాటికి ప్రైవేట్ సెక్టార్‌లోని చిన్న సంస్థలు కుదేలయ్యాయి.

- రాంచందర్‌జీ, ట్రస్మా గౌరవ అధ్యక్షుడు

ఉచిత విద్యను అందించాలి



పుట్టిన ప్రతీ బిడ్డకు చట్టాలతో పనిలేకుండా ఉచిత విద్యను అందించాలి. మా విద్యా సంస్థల్లో చాలామంది పేద విద్యార్థులకు రాయితీలు ఇస్తున్నాం. ప్రైవేట్ విద్యాసంస్థల సమావేశాలలో నిరుపేద విద్యార్థులకు విద్యను అందించడంపై చర్చించుకుంటాం.

- వంశీమోహన్ రెడ్డి, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నాయకుడు

తరచూ పాఠశాలలను మార్చొద్దు



విద్యార్థులు తరచూ పాఠశాలలను మార్చే విధానాన్ని అపాలి. పాఠశాలలను ఏ, బీ, సీ, డీ కేటగిరీలుగా విభజన చేయాలి. ఒకటి నుంచి ఎనిమిదవ తరగతి వరకు విద్యార్థి ఒకే పాఠశాలలో చదివే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

- లక్ష్మణ్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు

ఉపాధ్యాయులను నియమించాలి



ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలి. విద్యాహక్కు చట్టం అమలు బాధ్యత మనందరిపైనా ఉంది. కరోనాతో విద్యార్థులు సెల్‌ఫోన్, సామాజిక మాధ్యమాలకు చేరువయ్యారు. వాటి నుంచి దూరం చేసి విద్యవైపు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

- కె శ్రీనివాస్, సమగ్రశిక్షా జేఏసీ జిల్లా అధ్యక్షుడు

విద్య వ్యాపారంగా మారింది



విద్య వ్యాపారంగా మారింది. దీంతో చాల మంది నిరుపేద కుటుంబాల పిల్లలు విద్యకు దూరం అవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. మారుమూల గ్రామాలకు కూడా ప్రైవేట్ పాఠశాల బస్సులు వచ్చి విద్యార్థులను తీసుకెళ్తున్నాయి. విద్యారంగ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

- జగదీష్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు

నిధులు కేటాయించాలి



ప్రభుత్వాలు విద్యాభివృద్ధికోసం ఎన్ని చట్టాలు చేసినా, నిధులు కేటాయించకపోతే ఫలితం శూన్యం. అభివృద్ధి చెందిన దేశాల్లో విద్యా రంగానికి అధిక మొత్తంలో నిధులను కేటాయిస్తారు. ఫలితాలు కూడా అలానే ఉంటాయి. అవసరమైన నిధులు కేటాయించకుండా విద్యాభివృద్ధిని సాధించలేం.

- అనంతప్ప, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు

చట్టాన్ని అమలు చేయడం లేదు



కేంద్ర ప్రభుత్వం 2010లో విద్యాహక్కు చట్టం చేసింది. కానీ క్షేత్ర స్థాయిలో ఆశించిన స్థాయిలో అమలు చేయడం లేదు. విద్య ద్వారానే మహిళలు చైతన్యవంతులు అవుతారని గుర్తించిన జ్యోతిబా సావిత్రీ బాయి పూలే తొలి మహిళా పాఠశాలను ఏర్పాటు చేశారు. నేటి ప్రభుత్వాలు చట్టాలు చేస్తున్నాయి కానీ అమలును విస్మరిస్తున్నాయి.

- కృష్ణుడు, బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు

బాలలకు మేలు చేసిన చట్టం



బాలకార్మిక వ్యవస్థను రూపుమాపడంలో విద్యా హక్కు చట్టం ఎంతో దోహదపడింది. ఈ చట్టం ద్వారా విద్యా వ్యవస్థ మెరుగు పడింది. నేను సీసీ కుంటలో పని చేసినప్పుడు చాలా మంది పిల్లలు తల్లిదండ్రులుతో కలిసి బడికి వెళ్లకుండా బీడీలు చుట్టేవారు. విద్యా హక్కు చట్టం అమలు తర్వాత వారందరూ పాఠశాలల్లో చేరి చక్కగా చదువు కుంటున్నారు.

- లక్షణ్ సింగ్, మండల విద్యాధికారి

నాణ్యమైన విద్య అందించాలి



ప్రభుత్వం ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు నాణ్యమైన విద్యను అందించాలి. పాఠశాలలో ప్రతీ తరగతికి ఉపాధ్యాయుడిని నియమించాలి. ప్రైవేట్ పాఠశాలలకు విచ్చలవిడిగా అనుమతులు ఇస్తున్నారు. ఫీజులను నియంత్రించాలంటే కోర్టుకు వెళ్లారు. ఇష్టారాజ్యంగా ఫీజులను పెంచుతున్న విద్యాసంస్థలను గుర్తించి రద్దు చేయాలి.

- ప్రశాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

విద్యావ్యవస్థ నిర్వీర్యం



ప్రభుత్వాలే విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయి. ప్రైవేట్ విద్యా సంస్థలతో లోపాయికారి ఒప్పందాలు చేసుకుంటున్నాయి. ప్రభుత్వ పాఠశాలలకు నిధులు మంజూరు చేయడం లేదు. అటెండర్లు, నైట్‌వాచ్‌మెన్ల నియామకాలు కూడా లేవు. ఆపరేటర్లు లేక కంప్యూటర్లు దుమ్ము పట్టిపోయాయి.

- బాబునాయుడు, తపస్ జిల్లా అధ్యక్షుడు

మౌలిక వసతులు కల్పించాలి



ఆర్యుల నుంచి ఆంగ్లేయుల వరకు విద్యకు దూరం అవుతున్నది కొన్ని సామాజిక వర్గాలే. 2002లో 86వ రాజ్యంగ సవరణలో లోపాలు ఉన్నాయని కైలాస్ విద్యార్థి ఆధ్వర్యంలో పలు సూచనలు చేశారు. మౌలిక వసతులు కల్పించకుండా సంపూర్ణ విద్యను అందించలేం. ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలి.

- తాహెర్, ఎస్‌టీయూఎస్ అధ్యక్షుడు

స్పోర్ట్స్ బాక్స్

రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతగా నిలవాలి

» కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్



కబడ్డీ జిల్లా జట్టుతో అసోసియేషన్ నాయకులు, సభ్యులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలవాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్ అన్నారు. కబడ్డీ పురుషుల జిల్లా జట్టు ఎంపికలను శుక్రవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని స్టేడియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కురుమూర్తిగౌడ్ మాట్లాడుతూ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెల నాలుగు నుంచి ఏడవ తేదీ వరకు ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొంటారని తెలిపారు. పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని కోరారు. జిల్లా క్రీడాకారులు ఎంతో మంది జాతీయ స్థాయిలో రాణిస్తున్నారన్నారు. జిల్లాలో క్రీడాభివృద్ధికి తమ అసోసియేషన్ కృషి చేస్తోందన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో కబడ్డీ సంఘం సభ్యులు ముత్యం, రామచంద్రయ్య, దామోదర్ రెడ్డి, శ్రీనివాసులు, పాపారాయుడు, పురుషోత్తం, గణేశ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

టెన్నికాయిట్ పోటీలకు గురుకుల విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన గౌతమ్, విశాల్‌తో ఉపాధ్యాయులు

మక్తల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : టెన్నికాయిట్ రాష్ట్ర స్థాయి పోటీలకు మక్తల్ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్ ఆదేశం మేరకు, నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి దీప ఆధ్వర్యంలో సాయిజ్యోతి ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 23న జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గురుకుల పాఠశాల విద్యార్థులు గౌతమ్, విశాల్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ హెన్ని, స్వప్న తెలిపారు. వారు ఈ నెల 26న హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా పీఈటీ స్వప్న, అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దీప, జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్, సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోపాలంలను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి, శివప్రసాద్, కాశేశ్వరీ, మారుతి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

» మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి » ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్ క్రీడా పోటీలు ప్రారంభం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడా కోటాలో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని చాటాలని సూచించారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వనపర్తి, పెబ్బేరు, గద్వాల, వడ్డేపల్లి, కోస్గి, మహబూబ్‌నగర్ ప్రభుత్వ, జేపీఎన్‌సీ కళాశాలల నుంచి 420 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి (డీటీవో) శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ జీ.మోహన్‌బాబు, అధ్యాపకులు అప్పారావు, వీరస్వామి, రాజేశ్వరి, ప్రవీణ, పీడీ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

తొలి రోజు విజేతలు వీరే...

కబడ్డీ బాలికల విభాగంలో విజేతగా మహబూబ్‌నగర్ పాలిటెక్నిక్, రన్నర్‌గా పెబ్బేర్ పాలిటెక్నిక్ జట్టు నిలిచాయి. వాలీబాల్ బాలికల విభాగంలో విజేతగా పెబ్బేరు, రన్నర్‌గా మహబూబ్‌నగర్ జట్టు, బాలుర విభాగంలో విజేతగా మహబూబ్‌నగర్, రన్నర్‌గా గద్వాల విజయం సాధించాయి. ఖోఖో బాలికల విభాగంలో విజేతగా మహబూబ్‌నగర్, రన్నర్‌గా పెబ్బేరు, బాలుర విభాగంలో విజేతగా మహబూబ్‌నగర్, రన్నర్‌గా వనపర్తి జట్టు నిలిచాయి. అథ్లెటిక్స్ బాలుర విభాగంలో లాంగ్‌జంప్‌లో ఎం. మల్లేశ్ (వడ్డేపల్లి) ప్రథమ, మురళీకృష్ణ (మహబూబ్‌నగర్) ద్వితీయ స్థానాలను సొంతం చేసుకున్నారు. ట్రిపుల్ జంప్‌లో మురళీకృష్ణ (మహబూబ్‌నగర్), శివకుమార్ (మహబూబ్‌నగర్) ద్వితీయ, హైజంప్‌లో సిద్ధార్థ (కోస్గి), ప్రథమ, ఈశ్వర్ (గద్వాల) ద్వితీయ విజేతలుగా నిలిచారు. బ్యాడ్మింటన్ బాలికల విభాగం, సింగిల్స్‌లో అశ్విని (మహబూబ్‌నగర్) ప్రథమ, కె. కావ్యశ్రీ (పెబ్బేర్) ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. డబుల్స్‌లో గౌరీప్రియ, అనూష (వనపర్తి) ప్రథమ, జి. పూజిత, కె.ఇందు (పెబ్బేర్) ద్వితీయ స్థానాల్లో నిలిచారు.



తలపడుతున్న మహబూబ్‌నగర్, గద్వాల జట్ల క్రీడాకారులు

రెండవ రోజూ న్యాక్ బృందం పర్యటన

» పాలమూరు యూనివర్సిటీ అనుబంధ పీజీ సెంటర్లు, పలు విభాగాల పరిశీలన

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ పరిధిలో న్యాక్ బృందం పర్యటన రెండవ రోజు శుక్రవారం కొనసాగింది. ఒక బృందం కొల్లాపూర్, వనపర్తి పీజీ సెంటర్లను పరిశీలించింది. రెండవ బృందం గద్వాల పీజీ కేంద్రాన్ని పరిశీలించింది. న్యాక్ చైర్మన్, ప్రొఫెసర్ రామశంకర్ దూబే కోఆర్డినేటర్ ప్రొఫెసర్ కేకే ఆగర్వాల్‌లతో కూడిన మూడవ బృందం యూనివర్సిటీలోని స్పోర్ట్స్, ఇతర విభాగాలను పరిశీలించింది. బృందం సభ్యులు పరిపాలనా విభాగంలోని పలు రికార్డులను తనిఖీ చేశారు. ఐక్యూ ఏసీలో రికార్డులను ప్రాధాన్యక్రమంలో పరిశీలించారు.

అనంతరం ఫార్మసీ కళాశాలలోని సెమినార్ హాల్‌లో పూర్వ విద్యార్థులు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులతో వేర్వేరుగా న్యాక్ చైర్మన్, కోఆర్డినేటర్ ముఖాముఖి నిర్వహించారు. యూనివర్సిటీ సమస్యలు, అభివృద్ధి, పని తీరు, విధి విధానాలు, అవసరమైన వసతులు, యూనివర్సిటీ చరిత్ర, బోధన, బోధనేతర సిబ్బంది వేతనాలు, పరిశోధనలు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న న్యాక్ చైర్మన్ ప్రొఫెసర్ రామశంకర్ దూబే, కోఆర్డినేటర్ ప్రొఫెసర్ కేకే ఆగర్వాల్

న్యాక్ బృందం పర్యటనలో భాగంగా మూడవ రోజు శనివారం ప్లేస్‌మెంట్ సెల్, వసతి గృహాలు, ఎన్ఎస్ఎస్ సెల్, హెల్త్ సెంటర్, క్యాంపస్, బాలికల వసతి గృహాలను పరిశీలించనున్నది. అనంతరం మూడు రోజుల పర్యటన, పరిశీలిం చిన అంశాలను వివరించ నున్నారు. న్యాక్ బృందం వెంట పీయూ వైస్ చాన్సలర్, ప్రొ ఫెసర్ జీఎస్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

'పాలమూరు - డిండి' పేరుతో

సాగునీటి తరలింపునకు కుట్ర

» పాలమూరు అధ్యయన వేదిక

పాలమూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : 'పాలమూరు - డిండి' ఎత్తిపోతల పథకం పేరుతో సాగునీటిని తరలించుకుపోయేందుకు నల్లగొండ జిల్లా నాయకులు కుట్రలు పన్నుతున్నారని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అక్రమంగా సాగునీటి తరలింపును అడ్డుకునేందుకు ఉమ్మడి జిల్లా రైతాంగం పోరాడాలని, ఎక్కడికక్కడ నేతలను నిలదీయాలని పిలుపునిచ్చారు. పదేళ్ల పోరాటంలో మనతో కలిసి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, నేడు నీటి తరలింపునకు జీవో జారీ చేసి, నిధులను కేటాయించిందని ఆరోపించారు. ఇలాంటి అన్యాయమైన ఉత్తర్వును ఆపలేకపోయిన జిల్లా ప్రజా ప్రతినిధులు ఎవరి కోసం పనిచేస్తున్నారని ప్రశ్నించారు. కృష్ణానదిలో తెలంగాణ ప్రాంతానికి కేటాయించిన నీటినంతా నల్లగొండ జిల్లాకే వాడుతున్నారని ఆరోపించారు. ఉమ్మడి పాలమూరులోని ఎత్తిపోతల పథకాలు చిన్నవని, వాటిని నిర్వహించటానికి, స్థాయి పెంచేందుకు ప్రభుత్వం పూనుకోవడం లేదని విమర్శించారు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేవలం నల్లగొండ జిల్లాకే మంత్రిగా ఉన్నారా అని ప్రశ్నించారు. పేరుకు మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ముఖ్యమంత్రి, ప్లానింగ్ కమిషన్ డిప్యూటీ చైర్మన్ కూడా ఉన్నప్పటికీ రైతాంగానికి న్యాయం జరగడం లేదని, మన జిల్లా నాయకులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. పాలమూరు - డిండి ప్రతిపాదనను రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే కేసులు

» ఆపరేషన్ స్మైల్ బృందం ఎస్ఐ మాణిక్యనాయక్

పెద్దకొత్తపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పిల్లలను పనిలో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తామని ఆపరేషన్ స్మైల్ టీమ్ ఎస్ఐ మాణిక్యనాయక్, కార్మికశాఖ జిల్లా అధికారి రాజ్‌కుమార్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో పని చేస్తున్న ఓ బాలిక, కిరాణం దుకాణంలో పని చేస్తున్న బాలుడిని గుర్తించినట్లు తెలిపారు. వారిని పనిలో పెట్టుకున్న యజమానులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అనంతరం బాలలను నాగర్‌కర్నూల్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరిచి, తల్లిదండ్రులకు అప్పగించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శేఖర్, కానిస్టేబుళ్లు యూసుఫ్, రవీందర్, సిరియానా బేగం, చైల్డ్ హెల్ప్‌లైన్ సభ్యురాలు కవిత, కోనేరు స్వచ్ఛంద సంస్థ కమ్యూనిటీ మొబిలైజర్ రజిత పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఎమ్మార్పీఎస్ పట్టణ కమిటీ ఎన్నిక

జడ్చర్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ జడ్చర్ల పట్టణ కమిటీని శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా దేపల్లి రాజేష్, ప్రధాన కార్యదర్శిగా శివప్రసాద్, కోశాధికారులుగా తప్పెట విజయ్, అశోక్, ఉపాధ్యక్షుడిగా రాజు, శివకుమార్, చంద్రకాంత్, కార్యదర్శులుగా తుంగ ప్రభు, సాయికుమార్, కుమార్‌ను ఎన్నుకున్నారు.

నేడు తాత్కాలిక విద్యుత్ కోత

పాలమూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి విస్తరణలో భాగంగా శనివారం తాత్కాలిక విద్యుత్ కోత విధిస్తున్నట్లు రూరల్ ఏడీఈ మద్దిలేటి, ఏఈ నర్సిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రిస్టియన్‌పల్లి 11 కేవీ ఫీడర్ పరిధిలో స్తంభాల తొలగింపు, కొత్త స్తంభాల పనులు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు క్రిసియన్‌పల్లి, అయోధ్యనగర్, మధురానగర్, భూలక్ష్మి, జేపీఎన్‌ఈఎస్ కళాశాల పరిధిలోని ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

టై, బెల్టుల పంపిణీ

నవాబ్‌పేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అమ్మాపూర్ గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు అంకూరి నర్సింహులు, సుశీల దంపతులు గ్రామంలోని పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఉపాధ్యాయులతో కలిసి టై, బెల్టు ప్రదానం చేశారు. గతేడాది సుశీల ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కాగా, భర్త నర్సింహులు విద్యుత్ శాఖలో జూనియర్ లైన్‌మెన్‌గా ఉద్యోగం రావడంతో తాము చదువుకున్న పాఠశాలలో విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం కృష్ణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు జిల్లా టెన్నికాయిట్ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ జిల్లాలో ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ టోర్నీలో పాల్గొనే జిల్లా బాల, బాలికల జట్ల ఎంపికలను శనివారం స్థానిక స్టేడియం మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా టెన్నికాయిట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నటరాజ్, వడెన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 01-04-2006 తరువాత పుట్టిన వారు అర్హులని, ఉదయం 10 గంటలకు ఆధార్‌కార్డు, జనన ధ్రువ పత్రంతో హాజరుకావాలని కోరారు.

ఆర్టీసీ ప్రైవేటీకరణ ఆపాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ సంస్థను ప్రైవేటీకరించడం ఆపాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు విజయబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక డిపో ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ బస్సు పథకాలలో సవరణలు చేయాలన్నారు. కార్పొరేట్ సంస్థలకు ఇస్తున్న సబ్సిడీలను ఆర్టీసీకి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో శ్రీలత, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

నవాబ్‌పేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొల్లూర్ గ్రామానికి చెందిన నిరంజన్ (32) ఈ నెల 20న బైక్‌పై కొల్లూర్ నుంచి నవాబ్‌పేటకు వస్తుండగా అదుపు తప్పి కిందపడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లి సత్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ విక్రం తెలిపారు.

విద్యుత్ వైర్లు తెగిపడి కంది పంట దగ్ధం

నవాబ్‌పేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మెట్టుగడ్డతండాలో విద్యుత్ వైర్లు తెగిపడి గురువారం సాయంత్రం ఎకరన్నర కందిపంట దగ్ధమైంది. తండాకు చెందిన బాబునాయక్ తన వ్యవసాయ పొలంలో కంది పంట వేయగా, విద్యుత్ వైర్లు తెగిపడి మంటలు చెలరేగాయి. మంటలు ఆర్పేలోగా పంట పూర్తిగా కాలిపోవడంతో రూ.50 వేల వరకు నష్టం జరిగిందని బాబునాయక్ కన్నీరు పెట్టుకున్నారు.

వచ్చేనెల 11న పుత్రకామేష్టి యాగం

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఫిబ్రవరి 11వ తేదీన జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో పుత్రకామేష్టి యాగం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు రాజనరసింహ, బస్వరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంతానం కోరుకునే దంపతులకు అందరికీ సంతాన ప్రాప్తి కోసం అమ్మవారి ప్రసాదం ఉచితంగా ఇస్తామన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

రాజాపూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జడ్చర్ల, రాజాపూర్ ఎంఈవోలు మంజులా దేవి, సుధాకర్ ఆధ్వర్యంలో క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. పాఠశాల ట్రస్ట్ సభ్యురాలు నళిని, హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఎల్లయ్య, మోజెస్, సంజీవరెడ్డి, సరళ, వెంకటమ్మ, తిరుపతమ్మ, సరోజ, రాధ, పద్మావతి, రమాదేవి, శ్యామ్‌సుందర్, దివాకర్, హనుమప్ప, అరుంధతి, సతీష్, పాల్గొన్నారు. అంతకుముందు జాతీయ రహదారి 44 ఆధ్వర్యంలో నీటి శుద్ధీకరణ పరికరంతో పాటు రూ.1,80,000 విలువ చేసే కంప్యూటర్, ప్రొజెక్టర్, ప్రింటర్‌ను పాఠశాలకు అందజేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

» ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



హన్వాడ గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

హన్వాడ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తపేటలో జరిగిన గ్రామ సభకు కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ సభలో ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డుల కోసం ప్రతీ ఒక్కరి నుంచి అధికా రులు దరఖాస్తులు తీసు కుంటారన్నారు. ఏ ఒక్క పేదవాడు ప్రభుత్వ పథకాలకు దూరం కాకూడదని పలు మార్లు దరఖా స్తులు తీసుకోవడం జరుగుతుందన్నారు. ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డీఆర్డీఏ పీడీ నర్సింహులు, డీసీసీ ప్రధానకార్యదర్శి సిరాజ్ ఖాద్రి, కార్యదర్శి టంకర కృష్ణయ్య యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మక్సూద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రామ సభలు

భూత్పూర్ : మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రారంభించిన గ్రామ సభలు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజు మండలంలలోని హస్నాపూర్, మద్దిగట్ల, కొత్తూరు, అన్నాసాగర్, పాత మొల్గర గ్రామాల్లో గ్రామసభలు కొనసాగగా ప్రత్యేక అధికారులుగా వేణుగోపాల్, ఎంపీడీవో ప్రభాకర్‌చారి, ఏవో మురళిధర్, తహసీల్దార్ అబ్దుల్ రహమాన్ హాజరయ్యారు. మద్దిగట్ల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల మంజూరులో గ్రామస్థులు కొద్దిపాటి గొడవకు దిగగా, తహసీల్దార్ రహమాన్ సముదాయించారు.

● నవాబ్‌పేట : మండలంలోని కారుకొండ, వెంకటేశ్వరతండా గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. కారుకొండలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు గోపాల్ రైతు భరోసా ఎప్పుడిస్తారని అధికారులను అడుగగా, కాంగ్రెస్ నాయకుడు భూపాల్‌రెడ్డి ఎంపీటీసీగా ఉండి గ్రామానికి ఏం చేశామని నిలదీశారు. మార్కెట్ చైర్మన్ హరిలింగం ఇరువర్గాలను సముదాయించారు. వెంకటేశ్వరతండాలో మార్కెట్ వైస్ చైర్మన్ తులసీరాం జోక్యం చేసుకుని పదేళ్లుగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకపోవడంతో సమస్యలు వచ్చాయన్నారు.

● దేవరకద్ర : మండలంలోని దేవరకద్ర, జీన్గురాల, డోకూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రామ సభల్లో తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డుల జారీపై ప్రజలకు వివరించారు.

● మిడ్జిల్ : గ్రామ సభల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని మండల ప్రత్యేకాధికారి వెంకటేష్, ఎంపీడీవో గీతాంజలి, తహసీల్దార్ రాజు, ఎంపీవో జగదీశ్వర్, ఏవో సిద్ధార్థ అన్నారు. మండలంలోని లింబ్యాతండా, మిడ్జిల్, కొత్తపల్లి, అయ్యవారిపల్లి, పెద్దగుండ్లతండా, మసిగుండ్లపల్లి గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల జాబితాలో పేర్లురాని వారు దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 1,539 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో గీతాంజలి, ఎంపీవో జగదీష్‌కుమార్ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు 693, రేషన్‌కార్డులకు 710, ఆత్మీయ భరోసా 112, రైతు భరోసాకు 24 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

● కోయిలకొండ : మండలంలోని చింతల్ తండాలో ఏర్పాటు చేసిన గ్రామసభలో తహసీల్దార్ రాజా గణేష్ పాల్గొని, మాట్లాడారు. నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న గ్రామసభలు ముగిశాయన్నారు. గ్రామ సభల ద్వారా ఇందిరమ్మ ఇళ్లకు 762, రేషన్ కార్డులకు 2097, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 56, రైతు భరోసాకు 56, పింఛన్లకు 20, గృహజ్యోతికి 28, మహలక్ష్మి పథకానికి ఏడు దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో కాళప్ప తెలిపారు.



మద్దిగట్ల గ్రామ సభలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను చదివి వినిపిస్తున్న అధికారి

అర్హులకే ప్రభుత్వ పథకాలు : పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



మహ్మదాబాద్‌లో మాట్లాడుతున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

గండీడ్/మహ్మదాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : అర్హులకే ప్రభుత్వ పథకాలు అందుతాయని పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రంగారెడ్డిపల్లి, మహ్మదాబాద్ మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేసి, పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. గండీడ్ మండల కేంద్రంలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన, గ్రామ పంచాయతీ దగ్గర మోడల్ ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ నిర్వహించారు. రంగారెడ్డిపల్లి, గండీడ్‌లో గ్రామసభలో పాల్గొన్నారు. రైతు ఆగ్రో సెంటర్‌ను ప్రారంభించి, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గండీడ్ 33 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు రూ.మూడు కోట్లతో శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్హులందరికీ ప్రతీ పథకం అందుతోందని ఎవ్వరు ఆందోళన చెందొద్దన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని ఎంపీడీవో కార్యాలయంలో ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. డీఆర్డీవో నర్సిములు, అడిషనల్ డీఆర్డీవో ముసాయిదాబేగం, ఎస్సీ రమేష్, ఎంపీడీవో దేవన్న, తహసీల్దార్ తిరుపతయ్య, ఎంపీవో నరేందర్‌రెడ్డి, డీటీ మాధవి, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, కెఎం నారాయణ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం : ఎమ్మెల్యే జీఎంఆర్



జానంపేట గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

మూసాపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పేద బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జీఎంఆర్ అన్నారు. శుక్రవారం మండలంలోని జానంపేటలో నిర్వహించిన గ్రామసభకు ఎమ్మెల్యే పాల్గొని, మాట్లాడారు. అర్హులకు సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యమని, అర్హులను గుర్తించి అర్హులకు న్యాయం చేయడానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తహసీల్దార్ రాజు, ఎంపీడీవో కృష్ణయ్య, ఏపీఎం అనురాధ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కృష్ణయ్య, నాయకులు నిరంజన్, ప్రతాప్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కృష్ణయ్య, రాజేందర్‌రెడ్డి, బోడి వెంకటేష్, యాదయ్య, నారాయణ పాల్గొన్నారు.

ఆర్టిజన్లను పర్మినెంట్ చేయాలి



విద్యుత్ భవన్ ఎదుట నిరాహార దీక్ష చేపట్టిన ఆర్టిజన్లు

పాలమూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఆర్టిజన్లను పర్మినెంట్ చేయాలని విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్ భవన్ ఎదుట చేపట్టిన నిరాహార దీక్షలు శుక్రవారం ఐదో రోజుకు చేరుకున్నాయి. దీక్ష ప్రారంభానికి టీయూసీఐ జిల్లా కార్యదర్శి సి.వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2017 నుంచి విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ఆర్టిజన్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ముగింపులో జిల్లా నాయకుడు అంబదాసు మాట్లాడుతూ ఆర్టిజన్లకు వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించి పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి, రాములు, తిరుమలేష్, ప్రభాకర్, విజయ్ కుమార్, పాష, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాసచారి, విజయబాబు, మోహన్, సురేష్, నరసింహులు, వినోద్, మోహన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మండప నిర్మాణానికి భూమిపూజ

మూసాపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని రామస్వామి గుట్ట పురాతన రామలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం ఆలయ కమిటీ, దాతల సహకారంతో శివస్వాముల దీక్ష మండప నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వేముల గ్రామానికి చెందిన దాత రిటైర్డ్ సింగరేణి జనరల్ మేనేజర్ ఎడుదొడ్ల విజయ రాంరెడ్డి దంపతులు రూ.రెండు లక్షలు విరాళం అందజేశారు. ఇక ముందు కూడా మరింత విరాళం అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అన్కని నరేందర్‌సాగర్, ఎద్దుల శ్రీనివాస్‌రెడ్డి, ఎద్దుల తిరుపతిరెడ్డి, యుగంధర్‌రెడ్డి, పల్లె జగన్, అమ్మిక రాజేష్‌గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆలూరి గోవర్ధన్, నర్సింహులు, కె.రవికుమార్, గద్వాల తిరుపతి రెడ్డి, జి.గోవింద్‌రెడ్డి, రవిరాజాచారి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవాబ్‌పేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తీగలపల్లి గ్రామంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు ఆశన్న మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే సొంత నిధులతో సీసీ వేయించడం సంతోషం అన్నారు. నాయకులు రాఘవేందర్, వెంకటస్వామి, కృష్ణయ్య, వెంకటయ్య, రాజు, వెంకటేష్, రాజేష్, మాసయ్య, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

రేషన్‌కార్డులకు 33,913 దరఖాస్తులు

మహబబూబ్‌నగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన గ్రామ సభలలో ప్రజల నుంచి పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 26 నుంచి ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలను ప్రారంభిస్తున్న సందర్భంగా గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించింది.

అయితే ఇందులో రేషన్ కార్డుల కోసం అత్యధికంగా 33,913 దరఖా స్తులు రాగా, ఇందిరమ్మ ఇళ్ల కోసం 17,384, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 2,580, రైతు భరోసాకు 690 కొత్త దరఖాస్తులు వచ్చాయి.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

జడ్చర్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఓటరు దినోత్సవం పురస్కరించుకుని జడ్చర్ల మండల వనరుల కేంద్రంలో ఎంఈవో మంజులాదేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు నియోజకవర్గ స్థాయి వ్యాస రచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఉపన్యాస పోటీలలో బాదేపల్లి బాలుర జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు సాహితి, శ్రీవిద్య ప్రథమ, ద్వితీయ, నసరుల్లాబాద్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి శివకుమార్ తృతీయ స్థానం సాధించారు. వ్యాస రచన పోటీలలో పెద్దఆదిరాల జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి నవీన్ ప్రథమ, జడ్పీహెచ్‌ఎస్ బాలికల ఉర్దూ మీడియం విద్యార్థినీ రబియాసిద్దిఖీ ద్వితీయ, పెద్దఆదిరాల జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి శివ తృతీయ స్థానంలో నిలిచారు. వీరు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఎంఈవో తెలిపారు.

వ్యక్తి మృతి : కేసు నమోదు

జడ్చర్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీ కావేరమ్మపేట, రాజీవ్‌నగర్‌కాలనీలో నివాసం ఉంటున్న మీనుగ కోటయ్య(50) గురువారం అర్ధరాత్రి మృతి చెందాడని జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో జరిగిన ఓ ఫంక్షన్‌కు కులస్థులతో కలిసి వెళ్లి గురువారం రాత్రి ఇంటికి వచ్చాడని తెలిపారు. అనంతరం నిద్రించిన కోటయ్య మృతి చెందాడని తెలిపారు. కోటయ్య మృతికి కారణం తెలియడం లేదని, విచారణ చేపట్టి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలంటూ కోటయ్య సోదరుడు నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం జడ్చర్ల జనరల్ ఆసుపత్రికి తరలించామని, విచారణ చేపడుతున్నట్లు సీఐ ఆదిరెడ్డి వివరించారు.

సీపీఎం రాష్ట్ర మహా సభలను జయప్రదం చేద్దాం

జడ్చర్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లాలో జరిగే సీపీఎం రాష్ట్ర మహా సభలను జయప్రదం చేద్దామంటూ సీపీఎం మండల కార్యదర్శి జగన్ శుక్రవారం మండలంలోని చిన్నఆదిరాల, నాగసాల గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రూ.20వేలు విరాళాలు సేకరించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర మహా సభలకు మండల వ్యాప్తంగా అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

త్వరలో టాస్క్ రీజినల్ సెంటర్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని యువతకు ఉద్యోగానికి కావలసిన నైపుణ్యాలు పెంపొందించి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు టాస్క్ రీజినల్ సెంటర్‌ను అతి త్వరలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ప్రారంభించనున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టాస్క్ రీజినల్ సెంటర్ ద్వారా టెక్నికల్, నాన్ టెక్నికల్ కోర్సులలో శిక్షణ కొరకు డిప్లమా, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యార్థులు జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని టాస్క్ రీజినల్ సెంటర్ కార్యాలయంలో ఈనెల 27 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. టెక్నికల్ శిక్షణలో భాగంగా జావా ప్రోగ్రామింగ్, వెబ్ డెవలప్ మెంట్, పైథాన్ ప్రోగ్రామింగ్, డేటా బేస్ అప్లికేషన్స్, సీ ప్రోగ్రామింగ్, డేటా స్ట్రక్చర్స్ అల్గోరిథమ్స్, సూడో కోడ్, ఫుల్ స్టాక్ అప్లికేషన్స్ కోర్సుల్లో ఉద్యోగ మెళకువలు నేర్పించడంతో పాటు బ్యాంకింగ్ పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వేణు

మూసాపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఈజీ మనీకి అలవాటు పడ్డ సైబర్ నేరగాళ్లు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని అమాయకును టార్గెట్ చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారని మూసాపేట ఎస్‌ఐ వేణు అన్నారు. మండలంలోని జానంపేట గ్రామంలో గ్రామస్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు మారిన సాంకేతికతో ఫోన్లను ఆసరాగా చేసుకొని నేరపూరిత చర్యలకు పాల్పడుతున్నారు. గుర్తు తెలియని ఫోన్ నంబర్ల నుంచి ఫోన్ వచ్చినా, వాట్సాఫ్ వీడియో కాల్ వస్తే స్పందించొద్దు అన్నారు. బ్యాంకు, ఓటీపీ చెప్పరాదన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 100 డయల్ లేదా 1930 టోల్‌ఫ్రీ నెంబర్ లేదా నేరుగా తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అదే విధంగా వాహనదారులు రోడ్డు, నిబంధనలను పాటించాలని, హెల్మెట్, సీటుబెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపరాదన్నారు.

డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తులపై కేసు

మహబూబ్‌నగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : డబ్బులు తీసుకుని తిరిగి ఇవ్వకుండా మోసం చేస్తున్నారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని పాల్కబ్‌గుట్టకు చెందిన రాములమ్మ దగ్గర అదే కాలనీకి చెందిన చైతన్య సేవా సమితి ఎన్జీవో నిర్వాహకురాలు రాములమ్మ, వేణు గోపాల్, ప్రశాంత్ అవసరం నిమిత్తం రూ.5.65 లక్షల నగదు, మూడు తులాల బంగారు తీసుకున్నారు. తరువాత కొన్నాళ్లకు తన డబ్బులు, బంగారు ఇవ్వాలని రాములమ్మను కోరగా తనకు ఎలాంటి డబ్బులు, బంగారు ఇవ్వలేదని దుర్భాషలాడటంతో బాధితులు శుక్రవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎజాజొద్దీన్ తెలిపారు.

బేస్ స్పోకెన్ ఇంగ్లిష్ సంస్థను మూసివేయాలి

» రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు


రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న శ్రీదేవి

పాలమూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న బేస్ స్పోకెన్ ఇంగ్లిష్ సంస్థను తక్షణమే మూసివేయాలని ప్రజా సంఘాల నాయకులు ఏకగ్రీవంగా డిమాండ్ చేశారు. చైతన్య మహిళా సంఘం ఆధ్వర్యంలో సైకాలజిస్టు లక్ష్మణ్ చేత బాధించబడిన వారితో కలిసి శుక్రవారం టీఎన్‌జీవోస్ భవనంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు మాట్లాడారు. బేస్ స్పోకెన్ ఇంగ్లిష్ నడుపుతున్న లక్ష్మణ్ చేత నష్టపోయిన బాధితులు మహేశ్వరి, చంద్రకళకు జరిగిన నష్టాన్ని పిల్లలపై వ్యవహరించిన అరాచకాలు, మోసాలను వివరించారు. బేస్ ఇనిస్టిట్యూట్‌లో జరుగుతున్న మోసాలకు డీఈవో బాధ్యత వహించాలన్నారు. ఫ్యాకల్టి లేకుండా 40 మంది విద్యార్థులకు అన్ని సబ్జెక్టులు ఒక్కరే ఏ పద్ధతిలో చెబుతారనే దానిపై విచారణ జరిపించాలన్నారు. బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఇనిస్టిట్యూట్ నడిపిన, అద్దెకు ఉండిన బిల్డింగ్ ఓనర్స్‌ను విచారణ జరిపి అక్రమాలను వెలుగు లోకి తీసుకురావాలన్నారు. ఐదో తరగతి నుంచి తన దగ్గర ఉన్న పిల్లలకు స్కూల్స్, కళాశాలకు పంపకుండా ఏ విధంగా సర్టిఫికెట్స్ వస్తున్నాయో విచారణ జరపాలన్నారు. బాధితులకు మహిళా సంఘానికి లక్ష్మణ్ నుంచి ప్రాణహాని ఉందని, కాబట్టి రక్షణ కల్పించాలన్నారు. కృష్ణ ముదిరాజు, గోపాల్, మోహనకృష్ణ, గోవిందు(కేవీఎన్‌పీఎస్), ఆదిత్య (డీటీఎఫ్), విజయ్‌కుమార్, ఖలీల్ (టీఎఫ్‌టీయూ) మణ్యం (టీపీఎఫ్), రాఘవాచారి (పాలమూరు అధ్యయన వేదిక), శ్రీదేవి, రామలక్ష్మి, రాజేశ్వరి, శాంత, కస్తూరి (చైతన్య మహిళా సంఘం) ప్రతినిధులు ప్రసంగించారు.

కొనసాగుతున్న విచారణ

మహబూబ్‌నగర్ : సైకాలజిస్ట్ లక్ష్మణ్‌పై పోలీస్ విచారణ కొనసాగుతోంది. తమను మోసం చేసి లక్షల్లో డబ్బులు వసూలు చేశారని వారం క్రితం ఇద్దరు మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసును విచారిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు శుక్రవారం తన కార్యాలయంలో లక్ష్మణ్‌తో పాటు బాధిత మహిళలను విచారించి వివరాలు సేకరించారు. కాగా కేసు విచారణ సాగుతోందని, మరింత మంది మహిళలు బాధితులుగా ఉన్నారన్న ప్రచారం సాగుతున్నందున కేసు విచారణలో ఉందని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు.

వీధి దీపాల ఏర్పాటుకు పరిశీలన


అండర్ బ్రిడ్జి వద్ద వీధి దీపాల ఏర్పాటుకు పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, కౌన్సిలర్లు

జడ్చర్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీ రైల్వేస్టేషన్ సమీపంలోని రోడ్డు అండర్ బ్రిడ్జి వద్ద వీధి దీపాలు ఏర్పాటు చేసే అంశంపై మునిసిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, మునిసిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్ శుక్రవారం పరిశీలించారు. పోస్టాఫీసు నుంచి గాంధీచౌక్ వరకు రోడ్డు అండర్ బ్రిడ్జి వద్ద వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళ ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని, వీధి దీపాల ఏర్పాటుకు అంచనా వేయాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆదేశాల మేరకు పరిశలించినట్లు కమిషనర్ తెలిపారు. కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, నందకిశోర్‌గౌడ్, కుమ్మరి రాజు, మునిసిపల్ వర్క్ ఇన్‌స్పెక్టర్ సాధిక్, ఎలక్ట్రిషియన్ వెంకటేశ్, కరీం ఉన్నారు.

పుర కాలనీల అభివృద్ధికి పెద్దపీట

మహబూబ్‌నగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పురపాలిక పరిధిలోని కాలనీల అభివృద్ధికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పాలమూరు పురపాలిక పరిధిలోని 31, 22, 21, 27, 46 వార్డుల్లో రూ.4.16 కోట్లతో చేపట్టిన సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్‌తో కలిసి శంకుస్థానలు చేశారు. ఏడాది కాలంలోనే పురపాలికలో రూ.200 కోట్లకు పైగా పనులు చేపడుతున్నామని అన్ని వార్డులలో పార్టీలకు అతీతంగా నిధులు కేటాయించడం జరిగిందన్నారు. ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి పాల్గొన్నారు.